29న స్మారక పురస్కారం ప్రదానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: నవ్య సాహితీ సమితి, డాక్టర్ నందూరి రామకృష్ణమాచాయ సాహిత్య పీఠం సంయుక్తాధ్వర్యంలో అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందూరి రామకృష్ణమాచార్య జయంతిని జరుపుతున్నామని నిర్వహణ సంస్థల ప్రతినిధులు ఆచార్య ఫణీంద్ర, లక్ష్మీమానస తెలిపారు. చిక్కడపల్లిలో శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 29న సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు బాషా నిలయంలో జరిగే కార్యక్రమంలో, కవయిత్రి డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మికి నందూరి స్మారక పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. ప్రముఖులు కె.సాగర్‌రావు, ఆత్మకూరి గాంధీ, గోవిందరాజు, విజయకుమార్ పాల్గొన్నారు.

'అంబేడ్కర్‌ను అవమానించింది కాంగ్రెస్సే'



ఇంటింటా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమ

కాచిగూడ: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. 'బీఆర్ అంబేడ్కర్ సంవిధాన్ గౌరవ్ అభియాన్' కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ కాచిగూడ డివిజన్‌లోని బస్తీల్లో శనివారం ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాల సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం 9:30 గంటలకు మాసబ్‌ట్యాంక్‌లోని ఖాజామెన్షన్ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు శీర్‌సాగర్, బల్వీర్, మల్లికార్జున్, మురళి, బి.భీమ్‌రాజ్, సంతోష్, ఎస్.రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన సీవరేజ్ పైప్‌లైన్ వేయాలని జీఎంకు వినతి



జలమండలి జీఎం రామకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

నల్లకుంట: తిలక్‌నగర్ బస్తీలో నూతన సీవరేజీ పైపులైన్ నిర్మించాలని కోరుతూ తిలక్‌నగర్ నవశక్తి యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల రవి ఆధ్వర్యంలో ప్రతినిధులు నారాయణగూడలోని జలమండలి కార్యాలయంలో జీఎం రామకృష్ణకు శనివారం వినతి పత్రం అందజేశారు. బస్తీలో కొంతకాలంగా కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. జీఎం కూడా ఇప్పటికే ఈ సమస్యను అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని నూతన పైపులైన్ వేసేందుకు జలమండలి స్పెషల్ బడ్జెట్ ద్వారా నిధుల మంజూరు చేయిస్తానని హామీ నిచ్చారని వారు తెలిపారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

చిక్కడపల్లి: తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ సంబంధిత అధికారులను కోరారు. డివిజన్‌లోని జవహర్‌నగర్ ఎస్సార్టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో శనివారం ఆమె పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించాలని పలువురు ఆమెకు విన్నవించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, శివ, సత్తిరెడి, నీరజ్, ఆనంద్‌రావు, సంయుక్తరాణి, విశ్వనాథ్, సూర్యనారాయణ, ధనుంజయ్, అశోక్, కెనడీ, అలీ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ ఎ.పావని

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



భోలక్‌పూర్‌లో ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: వరంగల్‌లో నేడు జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు తెలంగాణవాదులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని బాకారం మల్లన్న ఆలయం నుంచి శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 60 బస్సులు, కార్లలో 5 వేల మందికి పైగా ర్యాలీగా తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ఆలేరులో కార్యకర్తలకు భోజన సైతం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహ, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, నాయకులు బింగి నవీన్, రహీం, మున్వర్‌చాంద్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, డివిజన్ నాయకులు గోవింద్, మగ్బుల్, జబ్బార్, సోమన్, శివ ముదిరాజ్, శ్రీకాంత్‌ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, కల్యాణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాండ్ కొడుతూ ముఠా జైసింహ ప్రచారం..

బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహ, బీఆర్ఎస్ నాయకులు బ్యాండ్ కొడుతూ వినూత్న ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి సభకు తరలిరావాలని కోరారు.



బ్యాండ్ కొడుతున్న ముఠా జైసింహ

విజయవంతం చేయండి

సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు కోరారు. గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

విద్యార్థులంతా గ్రామాలకు వెళ్లండి



ముషీరాబాద్: వేసవి సెలవుల్లో విద్యార్థులు పట్టణాల నుంచి గ్రామాలకు వెళ్లి వారి జీవన స్థితిగతులు తెలుసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పాడపంగి నాగరాజు అన్నారు. విద్యానగర్‌లోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ సంస్థ ఆవిర్భావం నుంచి వేసవి సెలవుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన విధానం, వారి స్థితిగతులపై అధ్యాయన యాత్ర నిర్వహిస్తోందని దానిలో భాగంగానే ఈ యేడు వచ్చే నెల మొదటి వారంలో రాష్ట్రంలో 'గ్రామాలకు తరలండి' అనే కార్యక్రమాన్ని నిర్వహించన్నునట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో జరుగుతుందని దీనిలో అన్ని జిల్లాల పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ నాయకుడు పి.మహేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రాజేశ్వర్, పి.కిరణ్, మంద నవీన్, సహాయ కార్యదర్శులు జి.మస్తాన్, డి.ప్రణయ్, కె.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆసిఫ్, జి.గౌతం, కె.ఝాన్సీ, ఎం.నాగరాజు, హలీంపాషా, శ్రీనివాస్, సింహాద్రి, మనోజ్, ప్రిన్స్ పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ముషీరాబాద్: వినోభానగర్ ప్రేయర్‌పవర్ చర్చి నుంచి జాంభవినగర్ ప్రధాన రోడ్డు వరకు గల కచ్చానాలా పూడికతీత పనులను కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు జయకుమార్, సురేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం



చిక్కడపల్లిలో కొవ్వొత్తులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్



లోయర్ ట్యాంక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం/కవాడిగూడ/నల్లకుంట/అంబర్‌పేట/ముషీరాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ శనివారం పలుచోట్ల నిరసనలు చేపట్టారు. అలాగే మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీలు తీసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. అలాగే ఉగ్రవాదాన్ని పూర్తి స్థాయిలో కూకటి వేళ్లతో పెకిలించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఫీవర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన..

గంగపుత్ర సంఘం నూతన కమిటీ నియామకం



ముషీరాబాద్: భోలక్‌పూర్‌లోని గంగపుత్ర సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.వి.వెంకటేశ్, ముఖ్య సలహాదారుగా గుండు కృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా శంకర్, అనిల్‌కుమార్, కోశాధికారిగా బైరు గోవింద్‌రాజుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అధ్యక్షుడు తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నిక



నర్సయ్యగౌడ్

ముషీరాబాద్: రాంనగర్‌లో శనివారం జరిగిన అడ్‌హక్ కమిటీ సభ్యుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల టీజేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా మేకపోతుల నర్సయ్యగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కోకన్వీనర్‌గా గొల్లపల్లి నాగరాజు, జి.రూబీ స్టీవెన్ సన్, జి.వీరారెడ్డి, కోఆర్డినేటర్లుగా ముత్తయ్య యాదవ్, తెలంగాణ వెంకన్న, బండి రమేశ్, ఉప్పు సుధాకర్, బొల్లం శ్రీనివాస్, టి.రవీందర్ నియమితులయ్యారు. పూర్తిస్థాయి కమిటీని త్వరలో ప్రకటిస్తామని కోకన్వీనర్లు గొల్లపల్లి నాగరాజు, జి.రూబీస్టీవెన్ సన్ తెలిపారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ మేకపోతుల నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలం, పింఛన్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభలోనూ ఉద్యమకారులకు మద్దతుగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం వరకు దశల వారీగా ఉద్యమ కార్యచరణ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని వివరించారు. చివరగా ఉద్యమకారుల సంక్షేమం లక్ష్యంగా జూన్ 1న అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారులు అమరణ నిరాహారదీక్షలు చేపడతామని పేర్కొన్నారు.

బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం



అభివాదం చేస్తున్న జేఏసీ చైర్మన్ కోల జనార్దన్, గుజ్జ కృష్ణ

కాచిగూడ: బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేసిన రెండు బీసీ బిల్లులు పార్లమెంట్‌లోనూ ఆమోదం పొందేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ చైర్మన్ కోల జనార్దన్ తెలిపారు. కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో గుజ్జ కృష్ణ, గోగులమండ స్వరూప సంయుక్తాధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశవ్యాప్తంగా మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేయడం ఆనందంగా ఉందని, అయితే మహిళా బిల్లులో దేశంలో సగ భాగంగా ఉన్న బీసీ మహిళలకు రిజర్వేషన్లలో సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారత కోసం మహిళలు వ్యాపార, పారిశ్రామిక రంగంలో ఎదిగేందుకు శ్రద్ధ తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని లేకుంటే దేశంలోని మహిళలను సమీకరించి వచ్చే నెల రెండో వారంలో పార్లమెంట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేముల పుష్పలత గౌడ్‌ను జాతీయ వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. భవానీరెడ్డి, వన్నాడి రమ్య, వళపాక నరసింహ, రోజా, అలిశెట్టి లక్ష్మీ యాదవ్, ఉషా భూషణ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కాచిగూడ: ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ జ్యోత్స్న, డీఐ సురేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడలోని ఫాతిమానగర్‌కు చెందిన అబ్దుల్ గని కుమారుడు మహ్మద్ అబ్దుల్ సత్తార్ (45) వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. మూడేళ్లగా భార్య, పిల్లలు దూరమయ్యారు. దీంతో మనస్తాపంతో పాటు జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని గాంధీ మార్చురికీ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలో చేరిక



ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి పదవికి రాజీనామా చేసి శనివారం సాయంత్రం బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: స్వాంతన చారిటబుల్ ట్రస్ట్, గద్దె రామోజీ ఫౌండేషన్, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో ఎంసీహెచ్ కాలనీ కమ్యూనిటీహాల్లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్ జి.సరిత గోవింద్ ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించగా కిమ్స్ ఆసుపత్రి నుంచి జనరల్ ఫిజిషియన్, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ వైద్యులు 250 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే కంటి పరీక్షలు, ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ ఎం.శ్రీనివాస్ మోకాళ్ల, నడుం నొప్పులతో బాధపడుతున్నవారికి ఎక్సర్ సైజులు చేసి చూపించారు. భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనతతో బాధపడుతున్నవారికి ఐరన్ ట్యాబ్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో జి.గోవింద్, ఐద్వానగర అధ్యక్షురాలు ఎ.పద్మ, జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నర్సింహామూర్తి, ప్రతినిధులు వెంకటనారాయణ, నర్సింగ్‌రావు, భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, స్వాంతన చారిటబుల్ ట్రస్ట్ జి.హితేష్‌గౌడ్, ఎంసీహెచ్ కాలనీ అధ్యక్షుడు వినీల్‌కుమార్, కిమ్స్ ఫౌండేషన్ క్యాంప్ కోఆర్డినేటర్ జె.విక్రం తదితరులు పాల్గొన్నారు,

'అందాల పోటీలను వ్యతిరేకించాలి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం/కవాడిగూడ: మహిళల ఆత్మగౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని భంగపరిచే అందాల పోటీలను వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తూ పీఓడబ్ల్యూ, ఐద్వా, సీఎంఎస్, అరుణోదయ సాంస్కృతిక కళామండలి ఆధ్వర్యంలో సుందరయ్య పార్కు నుంచి ఇందిరా పార్కు వరకు శనివారం భారీ ర్యాలీ తీసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి. సంధ్య, ప్రజా గాయకురాలు విమలక్కా, ఝాన్సీ మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ సంస్థతో కలిసి ప్రభుత్వం హైదరాబాద్‌లో వచ్చే నెల 10 నుంచి 31 వరకు జరగనున్న 72వ మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ రాష్ట్రానికే ఎంతో గర్వకారణమని ప్రభుత్వం ప్రచారం చేస్తోందని ఈ పోటీలతో తెలంగాణలో పర్యాటక రంగం చేనేత పరిశ్రమ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని టూరిజం శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్ చేసిన ప్రకటన వాస్తవ దూరమన్నారు. ఈ పోటీలపై పెడుతున్న కోట్లాది రూపాయల ఖర్చును ఆయా రంగాల అభివృద్ధిపై పెడితే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ర్యాలీలో మహిళా నాయకురాళ్లు అనసూయ, అరుణ, ఎస్ఎల్ పద్మ, అనురాధా, జ్యోతి, హేమలత, తేజ, సత్యనారాయణ, రాంబాబు, శ్రీహరి, జాన్ తదితరులు పాల్గొన్నారు.